# మీ కోసమే

"మిమ్మల్నే... వినిపించుకోరేంటి?" భర్త చెవిలో అరుస్తూ చెప్పింది విమల. చాలా కోపంగా ఉంది ఆమె. భర్తకి ఏదో చెప్పాలని చాలాసేపటి నుంచి ప్రయత్నిస్తోంది.

పేపర్ చదవడంలో మునిగి ఈదే అతడు, ఉలిక్కిపడి తల ఎత్తి చూసాడు.

వాతావరణం ప్రసన్నంగా లేదు. చీకటి శక్తుల కబంధ హస్తాల్లో నుండి స్వతంత్రుడైన ఉదయ సూర్యుడు జీవితాలకు కొత్త వెలుగు అందిస్తాడనే ఆశలను అడియాశలు చేసి చుట్టూ తిరిగే మబ్బుల వలయంలో చిక్కుకుని వెలుగు ప్రసరించలేకపోతున్నాడు. ఊరు మసక వెలుతురులో ఉంది.

"ఏమిటా కేకలు...? మెల్లగా చెప్పవచ్చుగా"

"మీకు హఠాత్తుగా చెవుడు వచ్చిందేమోనని. ఎంతసేపటి నుండి మొత్తుకుంటున్నానండి"

"ఏ విషయం?"

"అదేనండి గంగ విషయం..." పెద్ద స్వరంతో అంది విమల.

అతను చదువుతున్న పేపర్ పక్కన పెట్టాడు. ఒక సిగరెట్టు తీసి వెలిగించి పొగ పీల్చి అడిగాడు.

"ఏం మాట్లాడమంటావు? మనం మాట్లాడితే..."

హఠాత్తుగా లోపల గదిలో ఏదో నేల మీద పడి పగిలిన శబ్దం విని ఆగిపోయాడు.

"ఏమైంది గంగా...?" విమల అక్కడి నుండే అడిగింది.

"ఏం లేదమ్మగోరూ... సీసా చేయి జారి పడిపోయింది. అయ్యగారి విస్కీ సీసా. ఇంచుమించు ఖాళీయే అమ్మగారూ..."

"చూశారా... మీ విస్కీ సీసా పగులగొట్టింది. ఈ మధ్య రోజూ ఏదో ఒకటి పాడు చేస్తోంది. దానికి ఈ మధ్య పనిలో శ్రద్ధ తగ్గిందండి".

ఒక నిముషం భర్త వైపే చూస్తూ కూర్చుంది ఆమె.

అతడు స్పందించలేదు.

"గంగ చాలా దిగులుగా ఉందండి పాపం! చూస్తూ ఉంటే నా కడుపు తరుక్కు పోతోంది" విమల కళ్ళ నుండి కన్నీరు జాలువారింది.

అతనికి ఆశ్చర్యం అనిపించలేదు. ఒక మనిషికి మరో మనిషి పట్ల ప్రేమాభిమా నాలు ఏర్పడటానికి సహేతుకమైన వివరణ ఉండక్కరలేదని అతనికి తెలుసు.

గంగ ఇంట్లో పనిపిల్ల. కాని విమలకు ప్రసవించని కూతురు.

పదేళ్ళ క్రితం గంగని అతని వద్ద వదిలివెళ్ళారు దాని తండ్రి. అది ఇప్పటికీ అతనికి బాగా గుర్తే.

"అమ్మగోరూ... తల్లి లేని పిల్ల" ఆరోజు అతడు అన్నాడు.

"దీన్ని మీ బొట్టెలా సూసుకోండమ్మా" అతని గొంతు జీరబోయింది.

ఆ మాటలను మనస్ఫూర్తిగా ఆచరించింది విమల.

సొంత కూతురిలాగే పెంచింది. పిల్లలు కలగలేదనే బాధతో దిగులుపడే ఆమె ముఖంలో నిత్య వెన్నెల గూడు కట్టుకుంది.

గంగ తండ్రి తరువాత కనబడలేదు. గంగ జీతం కోసమూ రాలేదు. దాని చుట్టాలంటూ ఇప్పటి వరకు ఎవరూ గడప తొక్కలేదు.

"కాలమూ అలలూ ఎవ్వరి కోసమూ ఆగవు కదా" విమల గంగని తోడు తీసుకెళ్ళి జట్టుకు రంగు రాయించుకోవడం మొదలైంది. ముఖం మీద ముడతలు కనబడకుండా ఉండటానికి చాలా ప్రయత్నాలు మొదలుపెట్టింది. అతని పెరడులో నాటిన మామిడి మొక్క ఎదిగి కాసింది.

దోరగా పండిన పండు కోసం చిలుకలు, కాకులు ఇంటి చుట్టూ తిరగడం మొదలైంది.

గంగకి పెళ్ళి చెయ్యాలంది విమల. నిజమే! పెళ్ళి చెయ్యాలి. కాని గంగకి పెళ్ళి చేయడమంటే మాటలా...

ప్రేమ వివాహాలను మినహాయిస్తే ఎక్కడ లేని ఆభిజాత్యమూ, కులం పట్టింపులూ, గొడవలూ పెళ్ళి దగ్గరకు వచ్చినప్పుడే కనబడే నేటి సమాజంలో గంగకి పెళ్ళి చెయ్యడం ఎలా? గంగ కులం గురించి కాని, కుటుంబం గురించి కాని తెలియదు కదా! అయినా వాళ్ళు ప్రయత్నించారు గట్టిగా.

"ఏమండీ! గంగకి ఒక సంబంధం చూశానండి" ఆలస్యంగా ఇంటికి చేరిన ఒకరాత్రి తలుపు తీస్తూనే అంది విమల.

"ఎవరని అడగరేంటి? మనకు తెలిసిన కుర్రవాడే. పక్కవీధిలో మీ స్నేహితుడున్నాడు కదా. అతని డ్రైవరు. రెండు మూడు నెలల క్రితమే ఇక్కడికి వచ్చాడు"

"అలాగా...?"

"కుర్రవాడు చాలా బాగున్నాడండి"

"మిగతా వివరాలు..."

"పదో తరగతి పాసైనాడట. డిగ్రీ పాసైతే మీలాంటి వారు ఎవరైనా సర్కార్ నౌకరీ ఇప్పిస్తారని అనుకుంటున్నాడు"

"నువ్వు మాట్లాడావా?"

"మాట్లాడానండి. వివరాలు ఆరా తీస్తే తెలిసింది వాడు గంగకి దూరపు చుట్టమని"

"గంగని అడిగావా?"

అడిగానండి. దానికీ ఇష్టమే. చాలా బాగున్నాడండి కుర్రవాడు.

***

ఆలస్యం చెయ్యలేదు. పెళ్ళి జరిగిపోయింది.

సొంత కూతురిని కాపురానికి పంపుతున్నంత హడావుడి చేసి గంగను కాపురానికి పంపింది విమల. కాని వారం రోజుల్లో తిరిగి వచ్చేసింది.

ఆరోజు ప్రపంచానికి ఇంకా సూర్యుని వెలుగు అందక ముందే కాలింగ్ బెల్ శబ్దం విని లేచి తలుపు తీసాడు అతడు. ఎదురుగా గంగ-

ఏడ్చి ఏడ్చి ఉబ్బిన ముఖంతో... ఎర్రబడ్డ కళ్ళతో

"గంగ ఇక ఇక్కడే ఉండిపోతుందటండీ" పొద్దున కాఫీ ఇస్తూ విమల అతనితో అంది.

"ఎందువల్ల... ఏమిటీ గొడవ?"

"అతడు తాగుతాడట..."

"అదేం పెద్ద విషయం కాదే. ఈ కాలంలో తాగని వాడెవ్వడు? ఆ మాటకొస్తే నేనూ తాగుతున్నాను కదా"

"మీరైతే ఒకటి రెండు పెగ్గులు తాగుతారు. అలా కాదటండి. రోజుకు రెండు వందలకు తాగుతాడట"

అతను మాట్లాడలేదు.

ఎదురుగా ఉపరితలద్రోణిగా మొదలై అల్పపీడనంగా, వాయుగుండంగా మారిన వాతావరణం.

శూలాల్లాంటి తుఫాను జల్లుకు సతమతమయ్యే పుడమి–

"మీరు వాడిని పిలిచి మాట్లాడాలండి. మనకు గంగ పట్ల ఒక బాధ్యత ఉంది కదా" అంది విమల.

కబురు పెడితే ఒక సాయంత్రం వచ్చాడు వాడు.

"ఏమిటి సారు రమ్మన్నారట" బుర్ర గోక్కుంటూ దూరంగా నిలబడి వినయంగా అడిగాడు.

"ఏం లేదురా... బొత్తిగా నల్లపూసవైపోయావు అప్పుడప్పుడు కనబడవచ్చు కదరా"

"రాత్రైతే కాని ఇంటికి రారు కదా సార్ మీలాంటి ఆఫీసర్లు అప్పుడు..."

"అప్పుడు నువ్వు ఫుల్ మందులో ఉంటావు... అంతేనా...?"

"రోజుకు రెండు మూడు వందలకు తాగుతున్నావట" వాడు ఏమీ మాట్లాడలేదు. షాక్ తిన్నట్లు ఉన్నాడు.

"ఎందుకురా తాగి డబ్బు, ఆరోగ్యం పాడు చేసుకుంటావు?"

"నేను ఒక మాట చెప్పనా సారు..." బుర్ర గోక్కుంటూ వాడు మెల్లగా అడిగాడు. "తప్పు పట్టుకోరుగా..."

"చెప్పరా..."

"మేము ఎప్పుడైనా మా గురించి బతికామా సారు? ఎప్పుడూ మీలాంటి పెద్దోళ్ళ గురించే బతికాం కదండీ"

"ఏం చెబుతున్నావురా...?"

"వినుకోండి సారూ... మా తాత ముత్తాలు పెద్దోళ్ళ గురించే బతికారు. ఇప్పుడు నేనూ అంతే"

"సరిగా చెప్పరా..."

"నేనూ... మావాళ్ళు మీ కోసమే తాగుతున్నాం సారు. మీ జీతాల కోసం... మీ కార్ల కోసం..."

అతను ఖంగు తిన్నాడు.... నోట మాట రాలేదు.

***